క్లుప్తంగా

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించండి



ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న అంబేడ్కర్ సంఘం నేతలు

దోమ: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంబేడ్కర్ సంఘం నేతలు శ్రీనివాస్, వెంకటేశ్, రమేశ్ అన్నారు. గురువారం మండల పరిధి మోత్కూర్‌లో నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు మల్లేశ్, పాండును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేదల బిడ్డలే విద్యను అభ్యసిస్తుంటారని, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవతో వారిని తీర్చిదిద్దాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని కోరారు.

పనులు నాణ్యతగా ఉండాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

మోమిన్‌పేట: పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. గురువారం మండల పరిధి మేకవనంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వేస్తున్న పెయింటింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక్కో కేంద్రానికి రూ.3వేలతో రంగులు వేయిస్తున్నామని, మండలంలోని 37 కేంద్రాల్లో పనులు కొనసాగుతున్నాయి పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



ఎంపీఓను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దౌల్తాబాద్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. ఎంపీఓగా ఉద్యోగ విరమణ పొందిన రవీందర్ దంపతులను స్థానిక ఫంక్షన్‌హాలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడారు. రవీందర్ ఐదేళ్ల పాటు మండల ప్రజలకు ఎంతో సేవలందించారని గుర్తు చేశారు. ఇందులో రాష్ట్ర ఉన్నత కళాశాల జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దారు విజయ్‌కుమార్, నాయకులు మహిపాల్, విజయ్‌కుమార్, వెంకట్‌రావు, వీరన్న ఉన్నారు.

తొలగించారు.. మరమ్మతు మరిచారు



మోటారు తీయడంతో నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు

దుద్యాల్: తాగునీటి బోరు మోటారు తొలగించి పది రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు ఆరోపించారు. మండల పరిధి పోలేపల్లి గ్రామంలో తాగునీటి సరఫరా బోరుమోటారు కాలిపోయింది. మరమ్మతు కోసమని పంచాయతీ అధికారులు దానిని తొలగించారు. కానీ నేటి వరకు మరమ్మతు చేయించలేదు. దీంతో నీటి సరఫరా ఆగిపోయిందని స్థానికులు తెలిపారు. బోరు మోటార్‌ను బిగించి నీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

బొడ్రాయి గ్రామానికి పెద్ద దేవత

దోమ: బొడ్రాయి గ్రామానికి పెద్ద దేవత అని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి బడేంపల్లిలో గ్రామస్తులు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి బొడ్రాయి, ఊరడమ్మ దేవతలను దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామ దేవతలు ప్రజలకు రక్షణ కవచంలా ఉంటారని తెలిపారు. అలాంటి దేవతలను నిత్యం పూజించాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాలతో సన్మానించారు. మాజీ ఎంపీటీసీ సుజనా దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కవిత, నిర్వాహకులు సలీం, మహేశ్, శేఖర్ ఉన్నారు.

రైతన్నకు చేరువలో సేవలు

పొలాల వద్దకు వెళ్తున్న వ్యవసాయ అధికారులు

- పంట పరిశీలన అనంతరం యాప్‌లో వివరాల నమోదు
- ఆనందం వ్యక్తంచేస్తున్న రైతులు



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏడీఏ

దౌల్తాబాద్: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. రైతులకు మరింత చేరువై సాగులో ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పొలాల వద్దకు వెళ్లి పంట పరిశీలన చేయడంతో పాటు సాగులో సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించింది. అనంతరం అక్కడి నుంచే రైతుతో ఫొటో దిగి, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరిచేలా ఏఈఓలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్‌పై మండల డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఇదిలా ఉండగా.. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లకుండా, రైతు వేదికలు, జీపీ కార్యాలయాల్లో ఉంటూ సలహాలు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తుండడంతో.. ఇకపై ఇలాంటి వాటికి ఆస్కారం లేకుండా సాంకేతిక విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ విధానంతో రెండేళ్ల క్రితం నుంచి పని చేస్తున్నారు. అయితే మెరుగైన ఫలితాలు రావంతో ఏఈఓలు యాప్‌ను వినియోగంచేలా చర్యలు తీసుకున్నారు.

17 అంశాల నమోదు

ఏఈఓలు రైతుల వద్దకు వెళ్లిన సమయంలో ఎక్కడ ఉన్నారనే వివరాలను నమోదు చేయడంతో పాటు క్లస్టర్ పరిధి, ఏ ప్రాంత రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నారనే విషయాన్ని స్పష్టంగా యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. రైతువేదికలో చేపట్టినా నమోదు తప్పనిసరి. 17 అంశాలపై సమాచారం యాప్‌లో నమోదు చేసేలా ఏఈఓలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రైతు వేదికల్లో సమావేశాలు, క్రాప్ బుకింగ్, రైతుబీమా, విత్తన అనుమతులు, కొనుగోలు కేంద్రాల వివరాలు, భూసార పరీక్షలు, పంటకోత ప్రయోగాలు, జిల్లా స్థాయి సమావేశాలు, రైతుల పొలాల్లో ప్రదర్శనలు, రైతుబంధు, పీఎం కిసాన్, శిక్షణలు, సందర్శన, ఇన్‌పుట్ సబ్సిడీ, రిజిస్టర్ల నిర్వహణ, ప్రదర్శనల సందర్శన, అధికారుల సందర్శన వివరాలు యాప్‌లో ఉన్నాయి. వ్యవసాయ అధికారులు నిత్యం రైతు వేదిక వద్ద హాజరు నమోదు చేసుకున్న తర్వాత వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లి, నేరుగా పంటల పరిస్థితి పరిశీలించి సూచనలు ఇస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

“ పూర్తి స్థాయిలో అవగాహన

రైతులకు ఉపయోగపడే విధంగా యాప్ పనిచేస్తుంది. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడంతో పాటు 17 అంశాలతో కూడిన వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఏఈఓలు నేరుగా పొలాల వద్దకు వెళ్లి రైతులకు సలహాలు ఇస్తుండడంతో సాగుపై వారికి పూర్తి స్థాయిలో అవగాహన కలగనుంది. – శంకర్‌రాథోడ్, ఏడీఏ, కొడంగల్



అవగాహన కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు

పరిశుభ్రత పాటిస్తే.. ఆరోగ్యం

- మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప
- సీజనల్ వ్యాధులపై అవగాహన

దుద్యాల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని మలేరియా, ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకరికి డెంగీ లక్షణాలు ఉన్నాయన్న సమాచారంతో ఆ వక్యిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం డెంగీ జ్వరం వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం మనసొంతం అవుతుందని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమష్టిగా ప్రజలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. అనంతరం మురుగు కాలువలను పరిశీలించి జీపీ కార్మికుల సహాయంతో శానిటైజేషన్ చేయించారు. గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిల్వకుండా చూడాలని ఆదేశించారు. పలువురు ఇంటి పైన వాహనాల టైర్లు ఉండడంతో వాటి వలన వ్యాధులు సంక్రమిస్తాయని సూచించి, తొలగింపచేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సత్యనారాయణ, ఏఎన్‌ఎం రాములమ్మ, మాజీ సర్పంచ్ ఖాజామియా, ఆశ కార్యకర్తలు స్వాతి, ఎల్లమ్మ, సరిత, పద్మమ్మ పాల్గొన్నారు.

‘పంచాయతీ’ల్లో సత్తా చాటుతాం

జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్

తాండూరు రూరల్: పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రభుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూరు మండలంలో పార్టీ బలంగా ఉందని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందని, ఇదే జోష్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బస్వరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, మండల నాయకులు విజయ్‌కుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మలా ఆదరించి.. నాన్నలా చేరదీసి



మతిస్థిమితం లేని వ్యక్తికి క్షవరం చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకుడు

కొడంగల్ రూరల్: అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు.. మతిస్థిమితం లేని వ్యక్తులను చేరదీసి సపర్యలు చేశారు. గురువారం సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్‌కుమార్ ఓ వ్యక్తికి క్షవరం చేయించి, స్నానం చేయించారు. కొత్త దుస్తులు తొడిగించారు. అనంతరం భోజనం వడ్డించారు. దీంతో పలువురు నిర్వాహకుల సేవలను అభినందించారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

కొడంగల్ రూరల్: సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ బి.విజయకుమార్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేసిన మురళీధర్‌చారి సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనకు గురువారం వీడ్కోలు పలికారు.

విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంచాలి

- స్పందన, ప్రతి స్పందనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచన



కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

దుద్యాల్: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సామర్థ్యాలు అంటే చదవడం, రాయడం, ప్రశ్నించడం, సమాధానాలు ఇవ్వడం, కారణాలు చెప్పడం వంటి వాటిల్లో చిన్నారులు పట్టు సాధించేలా చేయాలని సూచించారు. త్వరలో ప్రతి పాఠశాలలో విద్యా సామర్థ్యాలను పరిశీలించే సర్వే కార్యక్రమం ఉంటుందని, కావున విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. ముఖ్యంగా 3,6,9వ తరగతి చదువుతున్న వారిలో తప్పనిసరిగా స్పందన, ప్రతి స్పందన వంటి నైపుణ్యాలు వేగంగా వృద్ధి చెందేలా శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో దుద్యాల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ రామారావ్, మండల పరిధి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రుణమాఫీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

పెద్దేముల్: కాంగ్రెస్ పాలనలోనే రైతులకు రుణమాఫీ అవుతుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్ అన్నారు. గురువారం మండల పరిధి రుక్మాపూర్ గ్రామంలో రెండో విడత రుణమాఫీ సందర్భంగా రైతులు, నాయకులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైఎస్ హయాంలో ఇచ్చిన మాట ప్రకారం మాఫీ జరగగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రుణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని సీఎం నిరూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శివలీల, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు, రైతులు శ్రీనివాస్, నరేందర్, నర్సింహరెడ్డి, కిష్టప్ప, రాములు పాల్గొన్నారు.

బస్సును పునఃప్రారంభించాలి

తాండూరు డీఎం సురేష్‌కుమార్‌కు వినతి



డీఎం సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దేముల్: పెద్దేముల్–హైదరాబాద్‌తో పాటు పెద్దేముల్–బీదర్ బస్సును పునః ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పీసీసీ మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మండల యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ ఆర్టీసీ తాండూరు డీఎం సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 20 ఏళ్లుగా పెద్దేముల్–హైదరాబాద్ నడిచిన సర్వీసును నిలిపివేశారని తెలిపారు. దీంతో నగరానికి వెళ్లే ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. కావున తాండూరు నుంచి ఉదయం 6గంటలకు, సాయంత్రం హైదరాబాద్ నుంచి 4 లేదా 5 గంటలకు హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్సు డీపో నుంచి బస్సును నడిపించాలని కోరారు. అదే విధంగా పెద్దేముల్, నాగులపల్లి మీదుగా బీదర్ సర్వీసును రోజుకు మూడు ట్రిప్పులు తిప్పేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇష్టారీతిన మాట్లాడితే సహించం

- సీఎం రేవంత్.. ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలంటూ బీఆర్‌ఎస్ డిమాండ్
- నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం



పరిగి: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పరిగి: అధికారంలో ఉన్నాం కదాని బీఆర్‌ఎస్ ప్రతినిధులపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ హెచ్చరించారు. అధికారం దుర్వినియోగం తగదని సూచించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన అనుచిత వాఖ్యాలకు నిరసనగా గురువారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముకుంద మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా అధికార మదంతో మాట్లాడితే సహించేది లేదని మండిపడ్డారు. అధికారం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించాలని, కక్షలు కుతంత్రాలకు పోవద్దని సూచించారు. ఇందులోట పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, సయ్యాద్‌పల్లి వెంకటయ్య, రవికుమార్ ఉన్నారు.

వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

పూడూరు: మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు హరీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేడ్కర్ కూడలిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళలకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఇందులో నాయకులు బస్వరాజ్‌గౌడ్, మహేశ్, రాంచందర్, శేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

దిష్టిబొమ్మతో ర్యాలీ

అనంతగిరి: ఎమ్మెల్యే సబితా రెడ్డిపై అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో సీఎం దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు తొలగించారు. దీంతో నాయకులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. ఇందులో కౌన్సిలర్లు గోపాల్, రామస్వామి, సీనియర్ నాయకులు ఉన్నారు.

కార్మికులకు అన్యాయం చేయొద్దు

- మిడ్డేమిల్‌ను యథాప్రకారం కొనసాగించండి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

కొడంగల్ రూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించి, కార్మికులకు అన్యాయం చేయొద్దని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కార్మికులతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హరేరామ–హరేకృష్ణ స్వచ్ఛంద సంస్థ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని నియోజకవర్గ కేంద్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టి, క్రమంగా రాష్ట్ర వ్యాప్తం చేస్తామని ప్రకటన చేయడం సరికాదన్నారు. ఎప్పటిలాగే పథకాన్ని కొనసాగిస్తూ.. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. కార్మికులు లత, లక్ష్మి, వెంకటమ్మ, సరిత, లావణ్య, జయమ్మ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• చారిత్రాత్మకమైన తీర్పు



పరిగి: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించ దగిన విషయమని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అలుపెరుగని పోరాటంతోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమయిందని కొనియాడారు. ఇందులో శ్రీనివాస్, బుచ్చన్న, నరసింహ ఉన్నారు.

మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం

అనంతగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు తీర్పును ఇవ్వడం హర్షించ దగిన విషయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు ప్రధాని నరేంద్ర మోదీ, సమితి అధ్యక్షుడు మందకృష్ణ మాదిగల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నోఏళ్ల పోరాటం ఫలించిందని పేర్కొన్నారు. ఇందులో ఎమ్మెస్పీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్, నాయకులు నవీన్, సుభాష్, నర్సింహ, పరమేష్ ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఆదివాసి చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబాటు వర్గాలకు అనుకూలంగా సుప్రీం ఇచ్చిన తీర్పు ఎంతో అత్యుత్తమమైందన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల నాయకుడు వెంకటయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయమై రాష్ట్రాల బాధ్యతను గుర్తు చేయడం హర్షణీయమన్నారు.

• ఫలహారం బండి ఊరేగింపు

మోమిన్‌పేట: అమ్మవారి జాతర సందర్భంగా గురువారం ఫలహారం బండిని ఊరేగించారు. ఆషాఢ మాసం దుర్గామాత మహోత్సవాలను మోమిన్‌పేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు అమ్మవారికి నైవేద్యం సమర్పించడంలో భాగంగా ఫలహారం బండిని గ్రామం పురవీధుల గుండా ఊరేగించారు.

• బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్

దోమ: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం రూపలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మంజుల రంగారెడ్డి జిల్లాలోని మొగిలిగిద్ద జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లగా.. ఆమె స్థానంలో కూకట్‌పల్లి జూనియర్ కళాశాలలో పని చేసిన రూపలక్ష్మి వచ్చారు.

• తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



నవాబుపేట: తల్లి పాలే పిల్లలకు శ్రేయస్కరమని ఏఎన్‌ఎంలు సంపూర్ణ, అంజలిలు అన్నారు. మండల పరిధి చించల్‌పేటలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిడ్డ పుట్టగానే తల్లులు ముర్రుపాలు తాగించాలని, అప్పుడే పిల్లలు శారీరకంగా పటిష్టంగా ఉంటారని చెప్పారు. బాలింతలు ఆకు కూరలు ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఇందులో అంగన్‌వాడీలు రాములమ్మ, లక్ష్మి, జగదాంబ, ఆశ వర్కర్లు భానుప్రియ, మైపాలమ్మ, దుర్గమ్మ తదితరలు ఉన్నారు.

• పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలి

బంట్వారం: పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ సాగుపై దృష్టి సారించాలని కోట్‌పల్లి వ్యవసాయ అధికారి పాండురంగా చారి రైతులకు సూచించారు. గురువారం ఆయన కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లిలో పంట పొలాలను సందర్శించి మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. సాగు విధానం, పురుగు మందుల పిచికారీపై ఏమైనా అనుమానాలు ఉంటే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని చెప్పారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి అందుబాటులో ఉంటూ పంటల గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. రైతు వేదికల్లో ఏఈఓలు ఉంటారని స్పష్టంచేశారు.

• స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్లు పరిపాలించిన బీఆర్‌ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సులువవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, రాంచందర్, రాముయాదవ్, పెంటయ్య, ఆంజనేయులు ఉన్నారు.

• ఆధునిక పద్ధతులతో బోధన

పూడూరు: ఆధునిక పద్ధతులను అనుసరించి విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. గురువారం మండల పరిధి మన్నేగుడ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా గుణాత్మకమైన విద్యను అందించాలని సూచించారు. మండల రిసోర్సుపర్సన్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న న్యాస్ పరీక్ష పై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రత్న, పుష్ప, హనుమంత్‌రెడ్డి ఉన్నారు.

• మహిళా రైతుకు సన్మానం



తాండూరు రూరల్: ప్రకృతి సాగు విధానంలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తున్న మహిళా రైతు జాన్సీని గోఆధారిత వ్యవసాయ పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్ సన్మానించారు. మండల పరిధి వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన జాన్సీని గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానం చేశారు.